# 7. గాలిపటం

నాలుగు నెలలు మందు ఇచ్చి ఇంటికి పొమ్మన్నాడు నా వైద్యుడు. "నీకిక పరవాలేదు. వజ్రకాయుడివి" అని ఆశీర్వదించాడు. నా శరీరములోని బలహీనతలు, బలహీనతలకు కారణమైన వ్యాధులు మొదలంటా రూపుమాసిపోయినంత ధైర్యము పొందాను.

ఏ అమృతమో నేను తెలుసుకోలేని ఇంక ఏదేని గొప్పవస్తువో వైద్యుడు నాకు వాడి వుంటాడని ఉల్లాసపడ్డాను. వికసించిన ముఖంతో ఇంటికి బయలు దేరాను.

ప్రతి నిత్యం ఆహార విహార విషయంలో తీసికోవలసిన జాగ్రత్తలన్నీ వైద్యుడు ఏకరువు పెట్టాడు. ఆయన విధించిన షరతులన్నింటిలో ప్రతినిత్యము పరగడుపున పావుసేరు ఆవుపాలు తాగటం చాలా ముఖ్యమైనది.

ఇంటికి వచ్చిన తర్వాత పదిహేనురోజుల వరకు ఆవుపాలకోసం ఎంతో అవస్థపడ్డాను. నమ్మకంగా కల్తీలేకుండా ఆవుపాలు దొర్కడం ఈ రోజుల్లో కష్టమని నా ప్రయత్న ఫలితం తేల్చివేసింది. "మనుషుల్నే కల్తీచేస్తున్న ఈ రోజుల్లో స్వచ్ఛమైన ఆవుపాలు ఎట్లా దొరుకుతాయి?" నా మిత్రుడు సీతయ్య అన్నాడు. అప్పుడే అతడు వోట్ల పోలింగు బూత్‌నుండి నిరుత్సాహంతో ఇంటికి వెళ్తున్నాడు. పోలింగులో తన ఆప్తమిత్రులే, తనకు బాగా పరిచయం వున్నవాళ్ళే మారుపేర్లతో మభ్యపెట్టే మాటలతో చేస్తున్న చేష్టపై అసహ్యత కల్గిందేమో! వారి ఆటలను కట్టివేయడం నిజాన్ని బట్టబయలు చేయడం శక్తికి మించిన పనైందేమో! తుదకు సీతయ్యకు నిరాశ నిస్పృహ కల్గి నిర్వీర్యుడై దేబె ముఖంతో ఇంటిదోవ పట్టడమే అతని మనసులో చెలరేగుతున్న తుఫాన్ను అడ్డకొనుటకు మార్గమనుకున్నాడేమో!

అతని ఆ మాటలు నా అమాయకత్వాన్ని అద్దంలో చూపించినట్లనిపించింది. అయినా ఆవుపాలు దొరకని పరితాపము నన్ను వేధిస్తూనే వుంది. ముఖ్యమైన పెద్ద పెద్ద పాల దుకాణాలన్నీ తిరిగాను. వేల రూపాయిల బేరంచేసే పాలవాండ్లను అడిగాను. తుదకు విసిగిపోయాను. కాని ఒక విషయంలో మాత్రం నాకు చాల తృప్తి కలిగింది. పాలబేరం చేసే ప్రతివాడు కల్తీలేని ఆవుపాలు దొరకవని చెప్పే స్థాయికొచ్చాడు. అటువంటి నగ్నసత్యాన్ని అరమర లేకుండా బయటపెట్టున్నారు. కల్తీపాలు కల్తీ కానివని చెప్పి అమ్మచూచే చైతన్యం మనోనిబ్బరం దెబ్బతిననందుకు సంతోషించాను.

నేను ప్రతిరోజు ఆఫీసునుండి ఇంటికిపోయే సందులో పాలు పెరుగు అమ్మే ఒక చిన్న దుకాణం వుంది. అంత చిన్న దుకాణంలో ఆవుపాలు దొర్కవనే నమ్మకంతో ఎన్నడూ అడ్గనేలేదు. కాని అనుకోకుండానే ఒకరోజు ఆ దుకాణంలో కూర్చున్న ముసలివాన్ని అడిగాను. "కల్తీలేని పాలు దొర్కడం కష్టం. మనం గట్టిగా మందులకు కావాలని పాలు తెచ్చేవాండ్లకు చెప్తే సరేనంటరు. కాని నమ్మటం కష్టం" ఒక్కొక్క మాటను తూచినట్లు గొణ్గుతూ అన్నాడు. ఇంతలో ఒక అమ్మాయి పక్కగదిలోంచి తొంగి చూచింది. "ఎందుకు దొర్కవు మామ. మన పెంటయ్య తాన మూడు ఆవులున్నయట, పాలు సుతం ఇస్తున్నయట, మనకు పోసే పాలల్లో ఆవుపాలు... అమ్మాయి కండ్లు వింతగా తెర్చి పరీక్షగా చనువుగా నన్నే చూడసాగింది.

"ఏమో మరి అడిగిసూడాలె" ఆ ముసలివాడు పాలకింది పొయిలో బొగ్గులు సవరిస్తూ అన్నాడు.

"రోజు ఎన్నిపాలు కావాలె నీకు" మందహాసం తొణికిస్తు ఆ అమ్మాయి నన్ను ప్రశ్నించింది.

ఇన్నాళ్ళనుండి పాలు దొరక్క విసిగివేసారి వున్న నాకు ఆమె మాటలతో ఎంతో ఆశకల్గింది. పైగా నావైపు చూస్తున్న వైనం, మాట్లాడే పద్ధతి ఎటువంటి వాన్నైనా ఆకర్షిస్తుంది.

ఆ అమ్మాయి చాలా అందంగానే వుంటుంది. పచ్చని శరీరము, వెడల్పాటి కండ్లు, నిటారైన ముక్కు, పల్చని చెంపలు, దానిమ్మ గింజల్లాంటి పండ్లు, ఎత్తుకు తగిన స్థూలము, బిగువైన రవికె, అద్దకపు తెల్లచీరెతో సొమ్ములులేని లోపాన్ని కప్పివేస్తూ మెరుస్తున్నది. పాలసంగతి మరచిపోయాను. మనస్సు చలించింది. నేనూ కండ్లన్ని ఆమె కప్పగించి తనివితీర చూచాను. ముసలివాడు తల నేలకు వేసి పక్కచూపులతో ఇదంతా గమనిస్తూనే పాలను కల్పుతున్నాడు. కొంటెగా తనకు తనే నవ్వుకొనుచున్నాడు. నా చిత్త వికారానికి కాకలుతీరిన ఆ వృద్ధుడు తన మధుర స్మృతుల్లో విహరించాడేమో.

అన్ని బలహీనతల నుండి కోలుకొని "వజ్రకాయుడు"గా వైద్యునితో వరము పొందాను కదు. అయితే అప్పటి నాస్థితి బలహీనమునకు చిహ్నామా, పుష్టికి పునాదా. తికమకపడ్డాను. తిరిగి తలెత్తి ఆ అమ్మాయిని చూడటానికే సాహసం కల్గలేదు.

"ఊఁ" అన్నది ఆ అమ్మాయి.

తలెత్తి చూశాను. నా ప్రత్యుత్తరానికై ఆ అమ్మాయి తన కండ్లపాపలను, కనుబొమ్మలను ఆడిస్తూ ప్రశ్నించింది. నా మనస్సును స్థిమితపర్చుకొని "రోజు అర్ధసేరు చాలు" అన్నాను.

"రూపాయి...కొక..." అంటు ఆ అమ్మాయి కొంటెగా చూపుడువేలు చూపింది.

"ఆఁ" అన్నాను.

"ఒక్కసారేందే పిచ్చిముండ" ముసలివాడు నవ్వాడు.

"ఒకసారన్నానామామ, ఒకసేరంటి" అని పైట సవరించుకున్నట్టు నటించింది "మరి ఏమంటావు ఇష్టమేనా?" ఆ అంటూ ద్వార బంధాన్ని కౌగిలించుకొన్నట్టు అనుకున్నది, ఆమె శృతిమించుతున్నది. ఆరునెల్ల అవుషధసేవతో పొందాననుకొన్న శక్తి, దారుఢ్యమూ నీర్రైపోయాయి.

తత్తరపడుతూ వణుకుతున్న నాలుకను స్వాధీనపర్చుకుని "ప్రతిరోజు పైసలిచ్చి పిల్లవాన్ని పంపుతుంటాను. కాగినవే పోస్తుండు తాత" తలవంచుకొని అన్నాను. ఆమెను చూడడానికే భయం వేస్తున్నది.

"తాతకే చెప్పుకుంటున్నవు? తాత ఎప్పుడు కూచోపోయినాడు? నేను అఘెశదుక్నంలో వుంట. మరి ఏడి ఏడియి ఇక్కడ్నె తాగిపోరాదు?" ఆ అమ్మాయి పాత బంధువంత చనువుగా అడిగింది.

ఆ మాటలతో నేను గుటకలు మింగటం ఎక్కువైంది. సమాధానం యిచ్చే యోగ్యత లేకపోయింది. అవుతల పడాలని ఆలోచిస్తున్నాను. నాకు అవుపాలు ముఖ్యం. పాలమ్మాయి దూరపు కొండవలె నన్ను ఆకర్షిస్తున్నది. కాని దెగ్గర్కిపోతే ?

"ఏమిటీ పిరికివేషం ? ముగ్గురు పిల్లల తండ్రివి అంత అసమర్థత ఎందుకు. నీవూ ఒక మగవాడివని అందులో అందమైన వాడివని ఆ అమ్మాయి మోహించింది. నీవు పక్కకు తొలిగినంత మాత్రాన చేస్తున్న ఉద్ధారకమేమిలేదు" హృదయములో తుఫాను రేగింది. జ్వరలక్షణాలు ఏర్పడినై, చెవుల్లో గుయ్యుమని ధ్వని పుట్టింది. నా మిత్రుడు వెంకట్రావు ఒకసారి వీపు తట్టి ఎన్నడో చేసిన హితవు జ్ఞాపకానికొచ్చింది.

"ఎవరో ఏమేమొ తప్పులు చేస్తుంటారని, అవినీతిగా మెల్గుతుంటారని మనం అనుకుంటాం. కాని అటువంటి వాతావరణం పరిస్థితి ఒత్తిడి మనకు కల్గినపుడు మనము ఏమౌతామొ అప్పుడుగాని తేలదు." వెంకట్రావు నిజంగా అక్కడ వుంటే నా కన్నీటితో అతని కాళ్ళు కడిగి నెత్తిన చల్లుకుందామన్నంత ఆవేశం పొందాను. మొఖమంతా మాడ్చుకుని ఆ అమ్మాయిని అసహ్యంగా చూస్తు "పిల్లవాడికి పైసలిచ్చి పంపుత. పాలు మాత్రం కల్తీలేకుండా వుండాలె" అని తల నేలకు వేసుకొని గంభీరంగా ఇంటికి బయలుదేరాను.

నాలుగు గజాలు ముందుకెళ్ళి అనుకోకుండానే వెనక్కు తిరిగి దుకాణం వైపు చూశాను. ఆ అమ్మాయి దుకాణం ముందట నిల్చుండి నావైపే చూస్తున్నది.

"మహామహులను మంటకలిపాం. భస్మాసురున్ని బుగ్గిపాలు చేశాం. రుక్మాంగదుని రూపే మార్పించాం. దేవేంద్రున్ని దేబె తేల్చివేశాం, శివుడిని చిందులు తొక్కించాం. విప్రనారాయణున్ని వీధికుక్కను చేశాం. మా విసురుకు తూలిపోనివాడు ఎవడూ లేదు. అంతెందుకు "బ్రహ్మకైనా పుట్టు రిమ్మతెగులు" అన్నంత ప్రతీకారం ఆమె చూపుల్లో తాండవమాడ్తున్నది.

పాలమ్మాయి వలెనే ఆనందాన్ని ప్రదర్శిస్తు ఆహ్వానించిన నా భార్యను చూడగానే వాడిపోయిన నా మొఖంలో తిరిగి ఆనందం కళకళలాడింది. ఎండలో అలసిసొలసి వచ్చిన నాకు దట్టమైన నీడ దొర్కినంత హాయి కల్గింది.

నా భార్య అందించిన కాఫీని తాగుతు నాకు నేనే ముసిముసిగా నవ్వుకుంటున్నాను. వక్కలు తీస్కొచ్చి పక్కకు కూర్చొని "ఏమిటండి! మీకు మీరే నవ్వుకుంటున్నారు?" అంటూ నా అంగీ గుండీలు సదిరింది.

పాలదుకాణం సంగతంతా చెప్పాను. "పాలకోసం పోతే ఆవేదొర్కింది. ఇంకేం? అదృష్టవంతులు" అల్మారాలోనుంచి అంగీని తెచ్చి అందిస్తూ కొంటెగా అన్నది నా భార్య.

"ఆ ఆవుపాలు నాకెందుకు?" నిర్లక్ష్యంగా అన్నాను.

"మీరు వైద్యుడిని అడిగి చూడండి. అసలు దొరకాలెగాని మనిషిపాలు చాలా మంచివి అని" కాఫీ కప్పు అందుకొని వెళ్ళిపోయింది.

"చాలా బింకంగా మాట్లాడుతున్నావు. కాని నేను ఆ అమ్మాయి వలలో పడ్తే నీవాలకం ఇట్లా వుంటుందా?" పత్రికను చూస్తునే అన్నాను.

గ్లాసులో కాఫీ తెచ్చుకొని, ఒక గుటకవేసి, మందహాసం కురిపిస్తూ కూర్చొని "అది మీకు ఉండాలెగాని మేము పడ్తే ఎన్నాళ్ళు పట్టి ఉంచగలం?" అన్నది నా భార్య.

కాలుతున్న గ్లాసును పైటకొంగుతో పట్టుకొని, ఒక్కొక్క గుటక వేస్తూ, ఎవరెవరి భార్యలు ఏవిధంగా ప్రవర్తిస్తున్నది, ఎవరెవరి భర్తలు ఎన్ని పిచ్చి చేష్టలు చేస్తున్నది ఏకరువు పెట్టింది.

"మరి మన గురించి కూడా ఎందరనుకుంటున్నారో?" పత్రికను చూస్తునే ప్రశ్నించాను.

"ఎవరేమనుకొంటే మనకేమండీ! మన సంగతి మనకు తెలియకుండా ఉందా? ఎవరి నీతి వారినే కాపాడుతుంది.. ఇంతకూ ఆ అమ్మాయి విధవా, ముత్తైదా?" కాఫీ గ్లాసును పక్కకు గోడవెంట పెట్టి సోది సాగిద్దామన్నట్టు కూర్చున్నది.

"ఏమో! అవన్ని ఎప్పుడు పరీక్షిస్తిని, ఆమె చూపులు విన్యాసాలతోనే హడలిపోతిని" అని పత్రికను మడిచి కిటికీలోంచి బజారువైపు చూశాను.

నా భార్య పైటకొంగు ముడివిప్పి, వక్కలు నోట్లోవేసుకుని "మగవాడికో ఆడది, ఆడదానికో మగవాడు – ఇద్దరూ లేందే ఈ కుళ్ళు బయలుదేరదు గద, దీంట్లో ఎవరిది తప్పంటాం" నిస్పృహతో అన్నది.

మెల్లగా వచ్చి నా పక్కకు నిలుచుండి, కిటికీలోంచి బజారువైపు చూస్తూ, "ముఖ్యంగా మీకు ఆవుపాలు దొరికాయి. కండ్లకింపైన అమ్మాయి కనపడింది. కంటికింపైతే కడుపుక్కూడ ఇంపుగా వుంటాయి. తాగిన పాలు బాగా వంటపడ్తాయి" అని కొంటెగా నన్ను చూచింది.

నా భార్య గొప్పతనానికి, మనోనిబ్బరానికి నేను ఉబ్బిపోయాను. అటువంటి భార్యను కలిగి ఉన్నందుకు చెప్పరాని ఆనందం కలిగింది.

ప్రతిరోజు పాలు తెప్పించుకొంటూనే వున్నాను. ప్రతిరోజు ఆ బాటన ఆఫీసుకు వెళ్తూ, వస్తూనే ఉన్నాను. ఆఫీసుకు వెళ్ళేటప్పుడు సుమారు వందగజాల దూరంనించి నన్ను కనిపెడ్తూ చూస్తూ ఉండేది ఆ అమ్మాయి. యీలోగా లక్షసార్లేనా ఆ బాటన నేను పోతుండగ చూచి ఉంటుంది. కాని నేను మాత్రం ఆ విషయం కనిపెట్టలేదు.

పాల బేరం కుదరిం తర్వాత ప్రతిరోజు ఆమెకండ్లు, నా కండ్లు కలుసుకోవడం, అప్పుడు నా మిత్రుడు వెంకట్రావు కండ్లలో ప్రత్యక్షమవడం జరుగుతుండేది.

ఓసారి సినిమాకుపోతూ, ఆ అమ్మాయిని నా భార్యకు చూపించాను. పాపం! ఏదో మంచి ఇంటి అమ్మాయి వోల్నే ఉంది. ఎట్లా ఈ కుళ్ళులో ప్రవేశించిందో 'నా భార్య తనకు తానే మధనపడ్డది." "అవకాశాలు తక్కువ వున్నాయి గనకనా?" తిరిగి అన్నది.

సుమారు మూడునెల్లు గడిచాక ఒకనాడు సాయంత్రం ఆ బాటన వెళ్తున్నాను. మసక మసక చీకటి ఉంది. నేను ఆ దుకాణం దాటి రెండు గజాలు ముందుకు వెళ్ళానో లేదో "లెక్క చూసుకోకపోతివి" ఆ అమ్మాయి పెద్దగా అన్నది. నేను వెనుకకు తిరిగి చూచాను. "నిన్నే రమ్మన్నది" చేతులాడించుకుంటు అన్నది.

నాకు పరీక్షా సమయ మాసన్నమైందనుకున్నాను. వెనుకకు తిరిగి దుకాణం వద్దకు వెళ్ళాను. "ఏం లెక్క? ఎప్పటికప్పుడు డబ్బు ఇస్తూనే వున్నానుగా" అంటూ కండ్లల్లో కండ్లు నిలిపి ప్రశ్నించాను.

ఆ అమ్మాయి ఆలోచిస్తున్నట్టు తలదించుకొని "మేమే మీకు పైసలివ్వాలె" అన్నది. ఆమె శరీరం పులకరించింది. అలసినట్టు ఒక దీర్ఘ నిశ్వాసాన్ని వదిలింది.

ఒక స్త్రీని వలలో వేసుకోడానికి, ఆమెలో దుర్బుద్ధి రేకెత్తించడానికి నూటికి నూటా యాభై వంతు పురుషుని దుష్ట చింతన, ప్రేరేపణ ఉంటుందని నా విశ్వాసం. కాని ఆ అమ్మాయి చొరవ, నిర్భీతి నా విశ్వాసాన్ని తప్పని తేల్చివేశాయి.

ఆ బాటన పొయ్యేవాండ్లు మమ్ములను వింతగా చూసి, తిరిగి తిరిగి వెనుకకు మళ్ళీ చూస్తూ పోసాగారు.

"ముసలాయన లేడూ ? ఎక్కడపోయాడు?" లోపలికి చూస్తూ అడిగాను.

"అవు! లేడు. ఊరికిపోయిండు. రేపో, ఎల్లుండో వస్తడు" అని దీనంగా నావేపు చూచింది. ఈ దీనతలో "ఈ అవకాశాన్ని వృథాపోనీయవద్దు" అని ఆమె కండ్లు అంటున్నాయి.

ఒయ్యారంగా తల ఎత్తి 'నీకోసం మీగడ దాచి ఉంచిన తినరాదూ!' అన్నది.

**"నిక్కము దాపనేల? ధరణీసురనందన! యింక నీపయిన్**
**జిక్కె మనంబు నాకు నను జిత్తజు బారికి నప్పగించెదో**
**చొక్కి మరంద మద్యముల చూఱలఁ బాటలువాడు తేంట్ల పెం**
**పెక్కిన యట్టి పూవు బొదరిండ్లను గౌఁగిటఁ గారవించెదో!'**

అన్నట్టు ఆమె ఒయ్యారం ప్రదర్శించింది. దాంతో నాకు కలిగిన ఉద్రేకాన్ని చంపుకొని, "మీగడ వద్దులే. కానీ పాలుకల్తీ లేకుండా పోస్తున్నావా?" విషయం మార్చాను.

"కల్తీ ఎందుకు లేదు. కాని..." తలెత్తి కొంటెగా నన్ను చూచింది. ఆ కల్తీ నీకు నుక్సాన్ చెయ్యదులే, మరింత బలంవస్తది. అని ఫక్కున నవ్వింది.

'అంటే?" బొమలు ముడిపెట్టి ఆశ్చర్యంగా అడిగాను.

"మనిషిపాలు.. యిష్టమేనా?" వంకరగా మెడలు తిప్పి ప్రశ్నించింది. నేనేమీ సమాధానమివ్వకముందే "నా పాలే కలుపుతున్న" అని పెండ్లి పిల్లవలె తల నేలకు వేసి "రాత్రి ఎనిమిదిగంటలకు వస్తే..." సమాధానానికై నిరీక్షిస్తున్నట్లు అట్లాగే తల నేలకు వేసి ఉంచింది.

స్త్రీ నోట ఆ విధంగా వినడం నాకే సిగ్గుగా తోచింది. ఆమె పరిసరాలు ఆమెలోని స్త్రీత్వమును, లజ్జను మొదలంట రూపుమాపాయని అదిరిపోయాను. నా ఒళ్ళంతా చెమటలు పట్టింది. నా భార్య మాటలు జ్ఞాపకానికొచ్చాయి. మిత్రుడు వెంకట్రావు కండ్లల్లో ప్రత్యక్షమయ్యాడు.

వెంటనే ఏమీ మాట్లాడలేకపోయాను. ఆ అమ్మాయిలో అప్పుడు సిగ్గు ఆవరించింది. నన్ను భూమిని మెల్లగా చూడసాగింది.

ఇంతలో నా మిత్రుడు మల్లేశం ఆ బాటనపోతు, నన్ను చూచి ఆగిపోయాడు. "ఇక్కడ నిల్చున్నావెందుకో?" అని భుజాన చేయివేసి, క్రీగంట అమ్మాయిని చూచాడు. నేను ఏమీ సమాధానమివ్వకనే పరీక్షగా మల్లేశాన్ని చూచాను.

"అవును, పని ఉండే వచ్చాను. నేనిక్కడ ఆవుపాలు కొంటున్నాను. వెళ్దాం పద" అని బయలుదేరి రెండడుగులు తిరిగి వెనుకకు వేసి, "చూడు అమ్మాయి ఇప్పుడే వస్తాను" అని తోవ బట్టాను. ఆమె మల్లేశాన్ని క్రోధంగా చూడసాగింది. "సమయానికి వీడెవడో తారసిల్లిండు" అని ఆమె బొమలు ప్రకటిస్తున్నాయి.

ఆ అమ్మాయి విషయం, ఇదివరకే మల్లేశానికి చాలా వివరాలు తెలుసు. వివరంగా ఆ విషయాలన్ని నాతో చెప్పాడు. నాకు కలిగిన అనుభవాన్ని వివరించాను. ఆ అమ్మాయిని ఆ విధంగా గాలిపటం వలె ఉండనివ్వొద్దనుకున్నాను. నా నిశ్చయానికి మల్లేశం చేయూతనిస్తానన్నాడు.

మల్లేశం, నేను నేరుగా మాయింటికి వెళ్ళి నాటి సంఘటన వివరాలన్నీ నా భార్యకు చెప్పాం. మా నిర్ణయాన్ని తెలిపాం.

"మీకెప్పుడూ ఏదో ఇటువంటివే వెంటపడ్తుంటాయి. సరే, కానియ్యండి, చలికాలం చాలారాత్రివరకూ పోకండి" అని నా భార్య ఆమోదముద్ర వేసి అనుమతి పత్రం ప్రసాదించింది.

ఆ అమ్మాయి కంటపడకుండా మల్లేశాన్ని మమ్ముల అనుసరించమని చెప్పి, నేను రాత్రి ఎనిమిది గంటలకల్లా పాల దుకాణం చేరుకున్నాను, అమ్మాయి సింగారించుకొని, ఉల్లాసంగా ఉంది.

"మా మామ ఇప్పుడే ఊర్నించి వచ్చిండు. బయట పనుండిపోతనని సెప్పిన. నీవేడికి రమ్మంటే ఆడికొస్త" చనువు ధోరణిలో అంది.

"సరే అయితే, బయలుదేరు."

"నువ్వు ముందుగా నడువు. నేను ఎనకాల ఒస్త."

నేను ముందట, కొంచెం దూరంగా ఆమె, ఆమెకుచాలా దూరంగా మల్లేశం పబ్లిక్‌గార్డెన్స్‌కు చేరుకున్నాం. మల్లేశం మాకు కనుపించేటట్లే దూరంగా కూర్చున్నాడు. యదార్థములో నాకు తోడుగా వుండాలనే మల్లేశాన్ని రమ్మన్నది.

పబ్లిక్‌గార్డెన్స్‌లో లైటుకు దూరంగా ఒకచెట్టుకింద, ఆమె నేను ఎదురుబడి కూర్చున్నాం. ఆమె మాట్లాడాలని ప్రయత్నిస్తున్నది. కాని మాట ఉబికి రావడం లేదు. ఉత్తమ ఇల్లాలువలె బిడియంతో కూర్చుంది.

"నీకు పెండ్లి అయిందా?" గంభీరంగా అడిగాను.

"ఆ! మూడుసార్లు"

నిర్విణ్ణున్నయ్యాను. ఆమె కండ్లల్లో నీళ్ళు తిరిగాయి.

"ఆ ముసలాయన నీకు మామెట్లా?"

"ఏదో ఒక వరుస వుండాలని 'మామ' అని పిలుస్తున్నా" గద్గదస్వరంతో అంది.

"అతనికి నీకు సంబంధం?"

"నీళ్ళతో మెరుస్తున్న కండ్లను నా కండ్లమీద నిలిపి, "నాకు ఆయనకేం సంబంధం?" తిరుగు ప్రశ్న వేసింది.

"అదికాదు సంగతి. నీకు ఆయనకు ఎట్లా పరిచయం కలిగింది. నిన్నెక్కడ్నించి ఏమని ఇక్కడికి తెచ్చిండు అని అడుగుతున్న."

"పెండ్లి చేస్తానని తీస్కొచ్చిండు."

"ఊం నాలుగో పెండ్లా?"

"పెండ్లి లేదు, పెడాకులు లేదు. అందరు పెండ్లి చేస్తనని యీడికి తెచ్చిన్రు–" కన్నీరు తుడుచుకుంటు అన్నది!

నా తల దిమ్మెక్కింది.

"ఎందుకు ఏడుస్తున్నావు?"

వెంటనే ఆమె సమాధానమివ్వలేదు.

"ఇల్లూ, పిల్లలతో సంసారం చేద్దామని నా గన్పిచ్చుదా. మా మామ మందికి భయపడి లేకలేక పుట్టిన పసిగుడ్డును మాయం చేసిండు." చిన్నపిల్లలాగ ఏడ్పు నాపుకుంటూ మెల్లగా చెప్పింది.

నా కండ్లలో నీళ్ళు గిర్రున తిరిగాయి. "చావసిద్ధమైన ముసలివాడికి ఎంత సాహసం" నాలో నేననుకున్నాను.

హిరోషిమాలో ఆటంబాంబుకు గురి అయిన పిల్లలు, పిల్లల తల్లులు, కరువుల్లో సంతానాన్ని, శీలాన్ని అమ్ముకున్న పిల్లలు, తల్లులు, తుఫాన్లకు, భూకంపాలకు నామరూపాలు లేకుండా వేలాది కుటుంబాలు నాశనం కావటానికి ఆ ముసలివాడే కారకుడన్నంత బాధతో ఆ ముసలివాణ్ణి గురించి ఆలోచించాను.

"పెండ్లి చేసుకొని ఓ చోట హాయిగా పడి ఉండరాదు?" మనసును స్వాధీనం చేసుకొని అన్నాను.

"నీకు పెండ్లి అయిందిగదా?"

"అవును, మరి నన్నెందుకు రాత్రి ఎన్మిది గంటలకు రమ్మన్నావు?"

"మీ మొగోండ్లకు పెండ్లయితేం" ఇంకా ఏదో అనబోయి, గంభీరించి ఊరుకుంది. వింతగా నన్ను చూచింది.

"చూడు! నీ ఊరేదో చెప్పితే నిన్ను తీసుకెళ్ళి నీకే చిక్కు లేకుండా ఏర్పాటు చేస్త!"

"మళ్ళీ ఏ మొఖం పెట్టుకొని మా ఊరుకుపోతా?"

మరి అయితే ఇక్కడెవరినన్నా పెండ్లి చేసుకుంటావా?"

"మా మామ ఇప్పుడు పెండ్లి కొప్పుకోవడంలే."

"అవును, ఎందుకు ఒప్పుకుంటాడు? వ్యాపారం దెబ్బతినదు?"

ఆ అమ్మాయి బెదిరినట్టు చూచి, "నా సంగతి అంతా నువ్వు బాగానే తెల్సుకున్నవు!" అన్నది.

"తెలిసికోబట్టే నీ విషయంలో పట్టుదల కలిగింది. ని న్నీవిధంగా ఊరికి బలిచేయతలచుకోలేదు. నేను నీ కొడుకుగా చెప్తున్న నీ పాలు తాగుతున్న గదా, నీవు నాకు తల్లితో సమానం. నీకు పెండ్లి చేసుకోవాల్నని ఉంటే నీ మామ, గీమ ఎవరూ అడ్డం రానివ్వం. నీకేం భయంలేదు. ఇప్పుడే నా వెంటవస్తే ఓచోట నిన్ను పదిలంగా కాపాడుతాం. మంచి పిల్లవాడ్నిచ్చి పెండ్లి చేస్తాం. ఏమంటావు?"

"ముంగట పెండ్లి చేయించినోళ్ళు, చేసుకున్నోళ్ళు గిట్టనే మాట్లాడిన్రు."

మా విషయంలో ఏ విధంగా నమ్మకం కలిగించాలో నాకు అర్థం కాలేదు! కొంతసేపు నిశ్శబ్దంగా గడిచింది.

"నాకు పాలు తాపడంలో నీ అభిప్రాయం?" ప్రశ్నించాను.

"రోజు పిండిపారపోసేకంటే అదే మంచిదనుకున్నా... నా పాలు ఒట్టిగ పారపోయటానికి మన్సొప్పలే" గుడ్లలో నీళ్ళు తీసుకొని అన్నది.

"నీ పాలుతాగే నామీద కన్నెయ్యడం మంచిది కాదనుకోలే?"

నేననుకున్నట్టు ఏది అయితున్నది. గిట్ల బతకటం నాకిష్టముందనుకుంటున్నావా?" గంభీరంగా ఎదురు ప్రశ్న వేసింది.

నా విషయంలో నమ్మకం కలిగించటానికి ఏం చేయాలనో నాకే తోచటం లేదు. కాసేపు తత్తరపడ్డాను. నిశ్శబ్దంగా కూర్చున్నాను.

"ఇంకెంతసేపు ఇట్ల కూసుందాం" తల నేలకు వేసి అన్నది.

"ఏం జేయమంటావు? నావెంట వస్తావా?"

"ఎక్కడికి, నీ యింటికా?" భయంతో అడిగింది.

అవును. నా ఇంటికే. నాకు నామీద విశ్వాసము లేకపోతే నా భార్యకు నా మీద విశ్వాసముంది."

ఆ అమ్మాయి అసమ్మతిగా తల నేలకు వేసింది. రాత్రి మించిపోతున్నది. పరిష్కారమార్గమేమి తోచలేదు. ఎటూ పాలుపోక లేచి నిల్చున్నాను. ఒక నిట్టూర్పు విడిచి ఆ అమ్మాయి కూడా లేచి నిల్చున్నది. నేను ముందుకు సాగుతుంటే మల్లేశం ఎదురైనాడు. ఆ అమ్మాయి అతన్ని చూసి బెదిరిపోయింది.

"భయపడకు నా స్నేహితుడే" అన్నాను.

ఆమె ఇంకా బెదిరినట్టు చూడసాగింది.

"ఏమంటది?" మల్లేశం ప్రశ్నించాడు.

"పాపం, నేటివరకు ఆమెకు కల్గిన అనుభవాలవల్ల మనలను నమ్మటం లేదు" అన్నాను.

అయితే మరి ఆమెను తిరిగి ఆ ముసలోనికి ఒప్పచెప్తే ఏమి లాభం? మనం అనుకున్నదంతా మంట్లో కలిసినట్టే" మల్లేశం అన్నాడు.

"ఇప్పటికైనా ఆలోచించుకో, నీ మంచికే చెప్పుతున్న. మమ్ముల్ను నమ్ముకో నీకు చెడుపే చేయదల్చుకుంటే మేమీవిధంగా ప్రవర్తిస్తామా?" దీనంగా అడిగాను.

"ఇంతకన్న ఎక్కువ మంచిగ మాట్లాడినోళ్ళను సూసిన."

ఒక్కొక్క అడుగు వేస్తు ముందుకు సాగాం. ఆలోచిస్తు ఆ అమ్మాయి కూడా మమ్ముల అనుసరించింది. ఊళ్ళో ప్రవేశించాం. సద్దు మణిగింది. మా ఇల్లు సమీపించింది. కిటికీలో నుంచి నా భార్య నాకోసం ఎదురు చూస్తూంది.

"అదిగో, అది నా యిల్లు, ఆ కిటికీలో నుంచి చూస్తున్నదే, ఆమే నా భార్య. కావాలంటే ఆమెతో కూడా మాట్లాడు" అన్నాను.

"ఈ సంగతంతా మీ ఆమె కెరికేనా?" భయంతో అడిగింది.

"అవును, ఇందులో రహస్యమేముంది. ఆడవాండ్ల సంగతులు ఆడవాండ్లకు రహస్యమా?" అంటూ ఇంటి తోవతీశాను. ఆమె మమ్మనుసరించి ఇంటికి వచ్చింది.

'మొుత్తానికి మెప్పించి వెంట తీసుకొచ్చినట్టున్నారు. పాపం! ఏదో మంచి పనే అయింది. రా! అమ్మా! రా అట్లా కూర్చో" నా భార్య ఆహ్వానించింది.

ఆమె తలవొంచుకుని కండ్ల నీళ్ళు తుడ్చుకుంటూ ఒక కుర్చీమీద కూర్చున్నది.

"పాపం! ఆమెను దగ్గరతీసిన వాండ్లందరు మోసంజేస్తూ వచ్చారట. అందువల్ల మమ్ములను నమ్మటం లేదు. నీవు కూడా చెప్పి చూడు" నా భార్యతో అన్నాను.

"అవును మీ మొగవాండ్లు సామాన్యులా? ఎవర్ని నమ్మాలో, ఎవర్ని నమ్మకూడదో తెల్సికోటం కష్టం" అంటూ నా భార్య ఆమె పక్కకుర్చీలో కూర్చున్నది. "మావారు నమ్మకస్థులని మాత్రం నేను చెప్పగలను" అని అమ్మాయి వీపుపై చేయి నిమిరింది.

"నా సంగతి మీకు బాగా తెల్సిందే కదా! నా మీద మీకు అనుమానం లేదనుకుంట" మల్లేశం మందహాసంతో అన్నాడు.

"నీకేం గురువుకు మించిన శిష్యుడివి" నా భార్య అన్నది.

"ఇతడేనా?" అన్నట్టు అమ్మాయి మల్లేశాన్ని ఓరకంట చూసింది.

అంతా సహపంక్తి భోజనం చేసి లేచాం.

'ఏం మల్లేశం గారు మాటకు వెనుకకు పోవద్దు. చూడు మావారికి మాట దక్కటమే కాదు. ఆమె జీవితం కూడా బాగుపడ్తుంది. పాపం ఎన్ని కష్టాలు అనుభవించిందో, ఇప్పటికైనా గట్టెక్కితే మంచిది" నా భార్య అన్నది.

"మొదలే అన్ని ఆలోచించుకోవాలెగాని మాట అన్నాక తిరుగు వుంటుందా." ఆ అమ్మాయిని చూస్తూ నా భార్యకు సమాధానంగా అన్నాడు.

"అయితే మీ వివాహం నిశ్చయం" నా భార్య అన్నది.

ఆ అమ్మాయి అమాంతంగా వచ్చి నన్ను కౌగిలించుకున్నది. చేపిన ఆమె పాల రొమ్ములు నా చొక్కాను తడిపాయి.

"పాపం" అంటూ నా భార్య కన్నీరు పెట్టింది.